క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకూరపాడు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు చెప్పారు.

ముప్పాళ్ళ: స్థానిక విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని విద్యుత్ లైన్లు, ఉప కేంద్రంలోని రాల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అచ్చంపేట: విద్యుత్ లైను క్రమబద్ధీకరణలో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ జి.కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సత్తెనపల్లి: పట్టణంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం తెలిపారు. 94941 16238 నంబరుకు సంప్రదించవచ్చన్నారు.

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఇన్‌చార్జి ఏఈ భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బెల్లంకొండ: బెల్లంకొండ, పాపాయపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో అన్నీ గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. 33కేవీ, 11కెవీ, ఎల్‌టీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


అచ్చంపేట: ఇటీవల వరదలకు భూక్యా గోపీ నాయక్ మృతి చెందారు. వైఎస్సార్ సీపీ నాయకులు మృతుడి ఇంటి కెళ్లి అతని కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మాజీ ఎంపీపీ భూక్యా కృష్ణానాయక్, చల్లగరిక శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంపై శిక్షణ



అచ్చంపేట: వరి, పత్తి, మిరప, కంది పంటల్లో పంట కోత ప్రయోగాలపై స్థానిక రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. సహాయ గణాంకాధికారి ఝాన్సీరాణి మాట్లాడుతూ ప్లాంటు ఎంపిక చేసుకునే విధానం, పంట కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫాం 1, 2 పూర్తి చేసే విధానాన్ని వివరించారు. ఈ ప్రయోగాల వల్ల దిగుబడి అంచనా వేసి నివేదిక సమర్పించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'బ్లూ బెల్స్' రూ.75 వేల విరాళం



అచ్చంపేట: విజయవాడ వరద బాధితులకు స్థాకు బ్లూ బెల్స్ హైస్కూలు తరపున రూ.75 వేలు విరాళం సేకరించారు. శుక్రవారం పాఠశాల డైరెక్టర్ బి.నిర్మలజ్యోతి, హెచ్‌ఎం శ్రీలత స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు నగదు చెక్కు అందజేశారు. ఉపాధ్యాయులంతా ఒక రోజు జీతాన్ని విరాళంగా ఇవ్వగా, యాజమాన్యం, విద్యార్థులు స్వచ్ఛందంగా ఇచ్చిన మొత్తం నగదును సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేసినట్లు హెచ్‌ఎం మేరీ శ్రీలత తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ వారిని అభినందించారు. చిగురుపాడు సర్పంచ్ గంధం కోటేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



బెల్లంకొండ: విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పల్ బి.ఉమాదేవి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పల్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం చేరుకునే దిశగా కష్టపడి చదవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఆట, పాటలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధ్యాపకులు కె.కవిత, శారదాదేవి, లక్ష్మీ సులోచన, వై.రమేష్‌బాబు, కుసుమ కుమారి, రత్నకుమారి, సత్యప్రభ, బాలు నాయర్, రిహానా పాల్గొన్నారు.

రాజీ మార్గం .. సత్వర పరిష్కారం



పట్టణంలోని న్యాయస్థానం భవనాల ముఖద్వారం

గతంలో జరిగిన లోక్ అదాలత్‌ల సమాచారం...

నిర్వహించిన తేదీ	పరిష్కరించిన కేసులు	చేతులుమారిన నగదు(రూ.ల్లో)
11-02-2023	661	65,25,783
13-05-2023	366	85,05,743
09-09-2023	709	1,21,59,633
09-12-2023	122	1,80,73,000
16-03-2024	117	1,72,88,256
29-06-2024	122	73,72,706
మొత్తం	2,097	6,99,25,121

- నేడు జాతీయ లోక్ అదాలత్
- సత్తెనపల్లిలో రెండు బెంచ్‌ల్లో నిర్వహణ

సత్తెనపల్లి: న్యాయస్థానాల్లో కొనసాగుతున్న రాజీకి అవకాశం కలిగిన కేసులను ఇరువర్గాల మధ్య రాజీ మార్గంలో పరిష్కరించేందుకు శనివారం సత్తెనపల్లి కోర్టుల ప్రాంగణం లో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని పోలీసులు, న్యాయవాదుల తోడ్పాటుతో విజయవంతం చేసేందుకు నిర్వాహకులు విస్తృత చర్యలు చేపడుతున్నారు. కోర్టులో ఉన్న కేసుల ఒత్తిడిని తగ్గించేందుకు న్యాయస్థానాలు ప్రతి మూడు నెలలకోసారి ఈ అదాలత్‌లు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా సత్తెనపల్లి న్యాయ సేవల సాధికార సంస్థ పర్యవేక్షణలో అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పరిష్కారానికి అవకాశం ఉన్న కాంపౌండబుల్ కేసులు...

రాజీకీ అవకాశం ఉన్నటువంటి కొట్లాటలు, వేధింపులు, జూదం, రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలు, ర్యాష్ డ్రైవింగ్, జగడాలు, భార్యాభర్తల తగవులు, బహిరంగ ప్రదేశంలో మద్యపానం, భూ వివాదాలు, సివిల్ వివాదాలు, కార్మిక, పారిశ్రామిక వివాదాలు, న్యూసెన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను పరిష్కరించుకోవచ్చు.

సత్తెనపల్లి లో ఉన్న న్యాయస్థానాలు..

సత్తెనపల్లిలో మొత్తం నాలుగు న్యాయస్థానాలు ఉన్నాయి. అయితే శనివారం జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ రెండు బెంచీలుగా జరగనుంది. మొదటి బెంచ్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్). ఈ బెంచ్‌కి న్యాయమూర్తిగా సీహెచ్.వెంకట నాగ శ్రీనివాసరావు, లోక్‌అదాలత్ మెంబర్‌గా న్యాయవాది ఆకుల నాగార్జున వ్యవహరించనున్నారు. సత్తెనపల్లి రెండవ బెంచ్ మొదటి అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్).ఈ బెంచ్‌కి న్యాయమూర్తిగా పి.ప్రియదర్శిని, లోక్ అదాలత్ మెంబర్‌గా న్యాయవాది బి.అమరయ్య నాయక్ వ్యవహరించనున్నారు.

న్యాయస్థానాల పరిధిలోని పోలీస్ స్టేషన్‌లు..

సత్తెనపల్లి నాలుగు న్యాయస్థానాల పరిధిలో తొమ్మిది పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. ఇవి కాక మూడు ప్రొహిబీషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. వీటిలో పోలీస్ స్టేషన్‌లకు సంబంధించి సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ. ప్రొహిబీషన్ అండ్ ఎక్సైజ్ కు సంబంధించి సత్తెనపల్లి టౌన్, క్రోసూరు, పెదకూరపాడు.

వ్యయ ప్రయాసలు ఉండవు



కోర్టులో ఉన్న కాంపౌండబుల్ కేసులను సులువుగా పరిష్కరించుకోవడానికి మూడు నెలలకు ఒక సారి నిర్వహించే లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుంది. తద్వారా కక్షిదారులకు సమయంతో పాటు సొమ్ము ఆదా అవుతుంది. కక్షలు విడనాడి సామరస్య ధోరణి అవలంబించినట్లయితే కేసుల నుంచి విముక్తి లభించి ఉపశమనం కలుగుతుంది.

–ఆకుల నాగార్జున, లోక్ అదాలత్ మెంబర్, సత్తెనపల్లి

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి



రాజీకి అనువైన కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఎంతో ఉపయోగ పడుతుంది. కేసుల భారాన్ని తగ్గించేందుకు ఉభయ వర్గాల మధ్య రాజీ కుదిర్చేందుకు చక్కటి వేదిక. జాతీయ లోక్‌అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

–ఎంవీ సుబ్బారెడ్డి, సీనియర్ న్యాయవాది, సత్తెనపల్లి

మట్టిని మింగేస్తున్నారు..!

- కొండ ప్రాంతాల్లో ఇష్టానుసారం తవ్వకాలు
- అటవీ భూమిలో మరింత జోరుగా..
- అధికారుల దాడులు లేవు.. కేసులు కట్టే ధైర్యం లేదు

నకరికల్లు: మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు కొండలను కేంద్రంగా చేసుకొని జోరుగా జరుగుతున్నాయి. భారీ పొక్లెయినర్లు, టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తూ.. జేబులు నింపుకుంటున్నారు. ప్రధానంగా త్రిపురాపురం, నర్సింగపాడు గ్రామాల పరిధిలోని కొండ ప్రాంతాల్లో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారు. నర్సింగపాడులోని సర్వే నంబర్ 97లోని భూములు, నకరికల్లు పరిధిలోని సర్వే నంబర్ 419, 420 పరిధిలోని అటవీ భూముల నుంచి మట్టిని తరలించేస్తున్నారు. అడ్డరోడ్డు గ్రామం సమీపం నుంచి త్రిపురాపురం వరకు అద్దంకి–నార్కట్ పల్లి రాష్ట్ర రహదారి విస్తరించింది. భారీ ట్రిప్పర్లతో మట్టిని సమీప గ్రామాలకు, పట్టణాలకు తరలిస్తున్నారు. తవ్వకాలు చేపట్టి తరలిస్తున్న మట్టికి సీనరేజీ ఎంత మేర చెల్లిస్తున్నారన్నది ఎవరికీ తెలియని రహస్యం. ట్రక్కు మట్టిని రూ.100లకు టిప్పర్ మట్టిని రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎదుటివారి అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని ఆ ధర మరింతగా పెరుగుతుంది. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా మట్టి దందా కొనసాగుతోంది. ముడుపులు ఇస్తే అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. భారీగా విస్తరించి ఉన్న కొండ ప్రాంతంలో ఈ తవ్వకాలు చేసి, ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతున్నప్పటికీ కేసులు నమోదు చేసిన దాఖలాలు లేకపోవడం విశేషం. ఈ విషయమై నకరికల్లు తహసీల్దారు కె.పుల్లారావును వివరణ కోరగా మైనింగ్ అధికారులు తనిఖీలు చేపడుతున్నారని, అక్రమ తవ్వకాలపై తప్పక చర్యలుంటాయని సమాధానం ఇచ్చారు.



నకరికల్లు సమీపంలో పొక్లెయినర్‌తో తవ్వకాలు



టిప్పర్‌లో తరలిపోతున్న మట్టి

శాస్త్రవేత్తల సిఫారసు పాటిస్తే పంటకు అధిక ధర



నార్నెపాడు(ముప్పాళ్ళ): ఆరోగ్యకరమైన పంటలు పండించడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ అన్నారు. నార్నెపాడు గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. శాస్త్రవేత్తల సిఫారసు చేసిన విధంగానే ఎరువులు, పురుగు మందులు వాడాలని చెప్పారు. పొలం బడిలో శాస్త్రవేత్తల సిఫారసు మేరకు పండించే పంటను గుర్తించి, రైతుకు ప్రభుత్వం ఇండి గ్యాప్ సర్టిఫికేట్ అందిస్తుందని తెలిపారు. సర్టిఫికేట్ పొందిన పంటలను ఎఫ్‌పీఓ(ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్) ద్వారా అధిక ధర వచ్చేలా చూస్తారన్నారు. పొలంబడి కార్యక్రమం 14వారాలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కె.ఎల్ ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై అవగాహన



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ప్రాధాన్యతపై శుక్రవారం సెక్టార్ సూపర్ వైజర్ బి.రత్నకుమారి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీ స్కూల్ ప్రయోజనాలు వివరించారు. తద్వార ఐసీడీఎస్ సేవల గురించి తెలుసుకోవాల్సిన తల్లులకు ఉందన్నారు. ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రానికి తమ చిన్నారులను క్రమం తప్పకుండా పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సుఖ వ్యాధులపై అవగాహన

గురజాల : హెచ్‌ఐవీ/ఎయిడ్స్ సుఖ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని రీడ్స్ ప్రాజెక్టు మేనేజర్ కోమలి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఓ యువత మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాధి నివారణ మార్గాలను వివరించారు. ఈ వ్యాధికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఐసీటీసీ కౌన్సిలర్ వెంకయ్య, ఎల్‌టీ కృష్ణ, మౌలాబి, పద్మ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల సీపీఎం కార్యాలయంలో కామ్రేడ్ సీతారాం ఏచూరికి నాయకులు, ప్రజా సంఘాల నేతలు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పోరాట యోధుడు, తెలుగుజాతి గర్వించదగ్గ ముద్దు బిడ్డ సీతారాం ఏచూరి అని కొనియాడారు. పుచ్చలపల్లి సుందరయ్య తర్వాత సీపీఎం అఖిల భారత కార్యదర్శిగా ఎక్కువ కాలం బాధ్యతలు నిర్వహించారన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కంది మళ్ళ సాంబశివరావు, మార్పుల వెంకటరెడ్డి, గారా జాలయ్య, పఠాన్ సైదాఖాన్, ఇందూరి వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, చింతపల్లి నాగమల్లేశ్వరరావు, కంచర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు

క్రోసూరు: స్థానిక డాక్టర్ అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాల సెంటర్ లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ శుక్రవారం జరిగింది. పార్టీ మండల కార్యదర్శి తిమిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి, దేశానికి తీరని లోటు అన్నారు. దేశంలో ప్రతి పౌరుడికి కూడు గుడ్డ నీడ విద్య వైద్యం పొందటం ప్రాథమిక హక్కుని ఆ విధంగా వర్గ పోరాటాలు చేయడమే సీతారాం ఏచూరికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. సీపీఎం నాయకులు ఆంజనేయులు, గనుపల్లిశేఖర్, పలువురు సీనియర్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

సత్తెనపల్లి: వరద బాధితులకు కూటమి ప్రభుత్వం ఇంటింటికీ నిత్యావసర వస్తువులు అందించిందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరద బాధితులు బాధపడుతుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. ఏపీ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు ఐదో వర్ధంతి ఈ నెల 16న నిర్వహించనున్నామన్నారు. దీనిలో భాగంగా సత్తెనపల్లిలో కోడెల శివప్రసాదరావు విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నామని, పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌కు ఆయన పేరు పెట్టనున్నట్లు చెప్పారు. కోడెల శివప్రసాదరావు వర్ధంతి సందర్భంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీలు అనే అంశంపై లెక్చర్ కూడా ఉంటుందన్నారు. అనంతరం ప్రతిభా అవార్డులు కూడా అందించనున్నామన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మక్కపాటి రామచంద్రరావు, న్యాయవాదులు పూజల వెంకట కోటయ్య, బాపయ్య చౌదరి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రూ.1.50లక్షల లడ్డూ ప్రసాదం

సత్తెనపల్లి: గణేశ్ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని గుండెపూడి వారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద 30 కేజీల లడ్డూ ప్రసాదాన్ని గురువారం రాత్రి వేలం పాట నిర్వహించారు. బంగారం వ్యాపారి భవిరిశెట్టి శ్రీనివాసరావు రూ.1.50 లక్షలకు దక్కించుకున్నాడు. ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాన్ని ప్రోత్సాహకంగా పొందాడు.



ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

పెదకూరపాడు: మండలంలోని లగడపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాల పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా నేలకొరిగాయి. మరమ్మతులు చేపట్టకపోవడంతో మరికొన్ని స్తంభాలు ప్రమాదపు అంచున ఉన్నాయి. పాఠశాల ఆవరణలో నిత్యం విద్యార్థులు తిరుగుతూ ఉంటారు. ఒరిగిన స్తంభాలు, విద్యుత్తు తీగలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



పాఠశాల వైపు ఒరిగి ఉన్న స్తంభం

విఘ్నాలు తొలగించు వినాయకా...!



వడ్డవల్లి చెక్క వంతెన వద్ద పూజలందుకున్న గణనాథుడు



బొడురాయి సెంటర్‌లో గణనాథుడు

సత్తెనపల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. 7వ రోజు శుక్రవారం వివిధ వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గణేష్ ఉత్సవ కమిటీలు ఏర్పాట్లను పర్యవేక్షించాయి. పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సత్తెనపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కంటెపూడి ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి అన్నారు. పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా 7, 8 తరగతుల విద్యార్థులకు పోషణ్ న్యూట్రిషన్ ప్రోగ్రాం ఎగ్జిబిషన్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ పి.ప్రమీల మాట్లాడుతూ తల్లి పాలలో ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయన్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, అంగన్వాడీ కార్యకర్తలు టి.జ్యోత్స్న, ఎన్.శాంతి, టి.జయలక్ష్మమ్మ విద్యార్థులు ఉన్నారు.



కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రమీల, విద్యార్థులు

స్వచ్ఛత హీ సేవను విజయవంతం చేయాలి

సత్తెనపల్లి: స్వచ్ఛ భారత్ దివస్‌ను అక్టోబర్ 2వ తేదీ నుంచి నిర్వహించుకోనున్న నేపథ్యంలో ఈ నెల 17 నుంచి వచ్చే స్వచ్ఛతా హీ సేవా పేరుతో కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో జీవి సత్యనారాయణ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై మానవ హారాలు, స్వచ్ఛత పరుగు నిర్వ హించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బహిరంగ స్థలాల్లో ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈఓపీఆర్‌డీ దయాసాగర్, ఫణిదం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్, కోలోకేటెడ్ వైద్యాధికారి డాక్టర్ సాయి తేజరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీడీ పి.వెంకటనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఆర్పీ రమేష్, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

నులిపురుగుల నివారణ కార్యక్రమం జయప్రదం చేయండి

క్రోసూరు: నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని ఎంపీడీఓ మహేష్ బాబు కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఆల్బెండజోల్ మాత్రల బాక్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ శాఖ సమష్టిగా కృషి చేయాలన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ ఎంఈఓ పున్నారావు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడికి మాత్రల బాక్స్ అందిస్తున్న ఎంపీడీవో మహేష్‌బాబు

సమాచార హక్కు చట్టంపై అవగాహన

క్రోసూరు: స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రిసోర్సు పర్సన్‌గా దొడ్లేరు ఉపాధ్యాయుడు ఎ.సదాశివ రెడ్డి వ్యవహరించి మాట్లాడారు. ప్రతి అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబు దారీతనం తీసుకురావడం కోసం సమాచార హక్కు చట్టం తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ చట్టం కింద సమాచారాన్ని ఇంగ్లీషు లేక స్థానిక భాషల్లో లిఖిత పూర్వకంగా తీసుకోవచ్చన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు విధానం, ఖర్చు తదితరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



సమచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న సదాశివారెడ్డి

డిమాండ్‌కు సరిపడా ఎరువులు

నకరికల్లు: మండలంలో 11,863 ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేస్తుండగా 10,063 ఎకరాల్లోని పంటలను ఈ–క్రాప్ నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు శుక్రవారం తెలిపారు. పలు గ్రామాల్లో సాగులో ఉన్న పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. కుంకలగుంట, చేజర్ల, కండ్లకుంట, చల్లగుండ్ల, చాగల్లు, గుండ్లపల్లి, నర్సింగపాడు రైతుసేవాకేంద్రాల్లో ఎరువుల నిల్వలు ఉన్నట్లు తెలిపారు. యూరియా 150 టన్నులు, డీఏపీ 40 టన్నులు, నకరికల్లులో సొసైటిలో యూరియా 12 టన్నులు, ప్రైవేటు డీలర్‌ల వద్ద 850 టన్నుల యూరియా, 310 టన్నుల డీఏపీ, 250 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.



ఏఓ కె.దేవదాసు

వరద బాధితులుగా గుర్తించండి

అమరావతి: కృష్ణా నది వరదలకు పూర్తిగా మునిగిపోయి, నష్టపోయిన తమను వరద బాధితులుగా గుర్తించాలని స్థానిక ప్రభుత్వాసుపత్రి వెనుకున్న వడ్డెర కాలనీ వాసులు శుక్రవారం తహసీల్దారు నాగమల్లేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. ఒడ్డున 10 మీటర్ల దూరంలో ఉన్న తమ ఇళ్లు మునిగిపోయి, మూడు రోజుల పాటు సదావర్తి సత్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో తలదాచుకున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు తమను బాధితులుగా గుర్తించకపోవటం దారుణమన్నారు. వడ్డెర కాలనీకి చెందిన 59 మంది తహసీల్దారు తమ గోడును వెళ్లబోసుకున్నారు.